




# కొంటె ప్రశ్నలడిగేవారిపై పన్నీరు 'ఫన్'నీరు

❖ పెళ్ళికి, విడాకులకీ తేడా?

పెళ్ళి అంటే ఒక ఆకులో తినడం(మన తాతలు, బామ్మలు చేసిన పని), విడాకులు అంటే చెరొక ఆకులో తినడం..

❖ టీన్ ఏజ్ తర్వాత వచ్చేది?

రొటీన్ ఏజ్..

❖ మీ పేరులో శంకరుడు ఉన్నాడు, నారాయణుడు ఉన్నాడు. బ్రహ్మ ఎందుకు లేడు?

బ్రహ్మ ఉంటే సృష్టి విపరీతంగా పెరిగిపోతుంది. అది మన పోలసీ కాదు.

❖ ప్లాస్టిక్ కు, ఎలాస్టిక్ కు తేడా ఏమిటి?

సాగదీస్తే గానీ తెలీదు..

❖ మీరు మందు పుచ్చుకుంటారా? మందులు పుచ్చుకుంటారా?

అది ఏకవచనమైనా, బహు వచనమైనా సైడ్ ఎఫెక్టులు తప్పవు

❖ సీతారాములు, పార్వతీ పరమేశ్వరులు..ఈ పేర్లన్నీ భార్యలతో ప్రారంభమౌతాయి..మరి నలదమయంతుల విషయం ఏమిటి రివర్స్ అయింది?

నలుడు వంటవచ్చిన మగాడు ..అందుకే ముందున్నాడు.

❖ ఈ దేశంలో ప్రతి అమ్మాయీ తానొక ఐశ్వర్యారాయ్ అంత అందగత్తెనని అనుకుంటే..

ఏ 'రాయ్' ఐతేనేం పళ్ళూడగొట్టుకోడానికి అని ప్రతిమగాడూ అనుకుంటాడు.

❖ ఉద్యోగం పురుష లక్షణం..మరి స్త్రీ లక్షణం?

యాజమాన్యం స్త్రీ లక్షణం..అనుకున్న పని పురుషుడితో చేయించడం..

❖ క్లాస్ మేట్స్ మొగుడూ పెళ్ళాలైతే..?

'క్లాష్'మేట్స్ అవుతారు.

❖ కళ్ళుపోకుండా ఉండాలంటే పోర్టబుల్ టీవీ మంచిదా, పెద్ద టివి మంచిదా?

ఏ టీవీ ఐనా మంచిదే.దాని మీదికి మన కళ్ళుపోకుండా ఉంటే..

❖ కరెంటు వారికీ, సినిమా దర్శకులకీ సంబంధం ఏమైనా ఉందా?

ఇద్దరికీ 'కట్..కట్' అనడం వెన్నతో(వైర్లతో) పెట్టిన విద్య.

❖ ఈ మధ్య అందరికీ హెల్త్ కాన్షస్నెస్ పెరిగి ఎక్సర్ సైజులు చేస్తున్నారు.. ఏమంటారు?

సైజు తగ్గడానికి చేసేవే ఎక్సర్-సైజులు

❖ ప్రేమకీ పెళ్ళికీ ఒక తేడా చెప్పండి..

ప్రేమించినంతసేపూ ప్రియురాలు అయస్కాంతం..పెళ్ళయాక సూర్యాకాంతం..!

